క్లుప్తంగా

బీఎల్వోలకు శిక్షణ



నిజాంపట్నం: ఫోన్ యాప్ ద్వారా ఓటర్ల నమోదు, ఇతర సర్వేలు చేసే విధానంపై బూత్ లెవల్ అధికారులు అవగాహన కలిగి ఉండాలని రిసోర్స్ పర్సన్ గుర్రం మురళీమోహన్ తెలిపారు. మండల కేంద్రమైన నిజాంపట్నంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో బీఎల్వోలకు సోమవారం నిర్వహించిన శిక్షణ తరగతిలో ఆయన పలు అంశాలపై శిక్షణనిచ్చారు. ఫోన్ యాప్ ద్వారా నూతన ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు చేసే విధానాన్ని తెలియజేశారు. హోమ్ ఓటింగ్, ఫార్ములా పూర్తి చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా రామలింగేశ్వరరావు బాధ్యతలు

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని చినపరిమి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఎంఎస్ రామలింగేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. చుండూరు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ బదిలీపై చినపరిమి వచ్చారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన జొన్నలగడ్డ వినయబాబు ప్రమోషన్‌పై అమర్తలూరు మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు.

గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



చావలి(వేమూరు): గిరిజనులకు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు బొనిగల అగస్టీన్ అన్నారు. వేమూరు మండలంలోని చావలి గ్రామంలో గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సోమవారం తహసీల్దారు సుశీలకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 59 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని, ఇంత వరకు ఆ స్థలాలు ఎక్కడ ఉన్నది చూడలేదన్నారు. గిరిజలకు ఇళ్ల స్థలాలు చూపించి పక్కా ఇళ్లు నిర్మించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మానికల ప్రభుదాసు, ఘంటా శ్రీనివాసరరావు, గంగాధరరావు, చిన్న అంకమ్మరావు, టి.వీర్లంకయ్య తూమ్మా గౌతమి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్యశిబిరం

తెనాలి: పట్టణ ప్రముఖుడు ఈదర రామారావు పదో వర్ధంతి సందర్భంగా ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్, అయితానగర్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో రెండురోజుల ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. స్థానిక మారిస్‌పేటలోని చెంచు రామానాయుడు హైస్కూల్‌లో ఏర్పాటైన శిబిరంలో అక్కడ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేశారు. మంగళవారం కూడా శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ బృందంతోపాటు ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఈదర వెంకట పూర్ణ చంద్, ఈదర శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, నల్లూరి వెంకటేశ్వరరావు, గుమ్మడి వెంకటనారాయణ, కన్నెగంటి మురళీకృష్ణ, గుమ్మడి ప్రసాద్, మునిపల్లి దుర్గాప్రసాద్, హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు పఠాన్ కరిముల్లా, అధ్యాపకుడు వెంకట్ పర్యవేక్షించారు.

చెరువులో చెత్త వేయకుండా చర్యలు తీసుకోండి


బాపట్ల: బాపట్ల మండలంలోని నందిరాజుతోట పాఠశాల వద్ద ఉన్న చెరువులో కొంత మంది చెత్త చెదారం వేసి నింపేందుకు ప్రయత్నిస్తున్నారని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళికి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం ఇచ్చారు. గ్రామస్తుడు కర్రి అశోక్‌కుమార్‌తోపాటు పలువురు వినతిపత్రం అందించారు. సర్వే నెంబరు 848లోని 2.48 ఎకరాల భూమిలో ఉన్న చెరువును కాపాడాలని కోరారు. చెరువులో చెత్త చెదారం వేయటంతో కుళ్లిన వాసనతో విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వెంటనే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు.

ఫార్మ డీ ఫలితాల్లో ఏఎస్ఎన్ విద్యార్థుల ప్రతిభ

తెనాలిఅర్బన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఫార్మ డీ ఫలితాల్లో తెనాలిలోని అన్నాబత్తుని సత్యనారాయణ ఫార్మసీ కళాశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కంచర్లపల్లి వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల్లో రెండో సంవత్సరం విద్యార్థిని జె.రాజకుమారి, మూడోవ సంవత్సరం విద్యార్థులు డి.శ్రీచక్రి, బి.ఏస్తేరు, నాల్గోవర సంవత్సరం విద్యార్థిని ఐ.నీలమ్మ, ఐదోవ సంవత్సరం విద్యార్థి పి.భగవత్ అత్యుత్తమ మార్కులు సాధించినట్లు చెప్పారు. వీరిని ఏఎస్ఎన్ విద్యా సంస్థల చైర్మన్ అన్నాబత్తుని శివకుమార్ అభినందించారు.

అప్పులతోనే భోజనం

- ఆందోళనలో మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులకు
- ఆరు నెలలుగా అందని బిల్లులు, గౌరవ వేతనం
- వెంటనే చెల్లించాలని కోరుతున్న నిర్వాహకులు



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

వేమూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద పిల్లలకు సుచి, రుచికరమైన భోజనం అందించాలని ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తుంది. కానీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న నిర్వాహకులకు మాత్రం ఆరు నెలలుగా బిల్లులు అందని పరిస్థితి. బిల్లులు చెల్లించకపోవడంతో వారు అప్పులు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టడం జరుగుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేట్టిన ఏడాది గడిచినా గత ఆరు నెలల నుంచి బిల్లులు చెల్లించడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు. ఆరు నెలల నుంచి అప్పు చేసి మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని, దీంతో అప్పులు పెరిగిపోతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు వెంటనే బిల్లులు చెల్లించాలని వారు కోరుతున్నారు.

వేమూరు మండలంలో మొత్తం 39 పాఠశాలలు ఉన్నాయి. మండల పరిషత్ ఉన్నత పాఠశాలలు 32, ప్రైమరీ పాఠశాల 1, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 5, ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1 కొనసాగుతున్నాయి. ఈ పాఠశాలల్లో మొత్తం దాదాపు 1,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల్లో మొత్తం 63 మంది మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు పని చేస్తున్నారు. ప్రతి రోజు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెట్టడం జరుగుతుంది.

గౌరవ వేతనం ఇవ్వడం లేదు

మధ్యాహ్న భోజనం పథకం బిల్లులతో పాటు, నిర్వాహకులకు గౌరవ వేతనం అందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 63 మంది నిర్వాహకులకు గౌరవ వేతనం ఆరు నెలలు నుంచి ఇవ్వడం లేదన్నారు. మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులకు కేంద్ర ప్రభుత్వం రూ.1,000, రాష్ట్ర ప్రభుత్వం రూ.2,000 ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జనవరి నెల నుంచి జూలై నెల వరకు గౌరవ వేతనం ఇవ్వాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి గౌరవ వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

బిల్లులు చెలించాలి



మండల పరిషత్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలిగా 15 సంవత్సరాల నుంచి చేస్తున్నాను. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పథకం నిర్వాహకులకు బిల్లులు, గౌరవ వేతనం చెల్లించడం లేదు.

– ఈపూరు లత, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలు, వరహాపురం

సాంకేతిక లోపాల వల్ల..



మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు గౌరవ వేతనం, బిల్లులు సాంకేతిక లోపాల వల్ల చెల్లించ లేదు. సాంకేతిక లోపాలు సరి చేసిన తర్వాత బిల్లులు సక్రమంగా చెల్లించడం జరుగుతుంది.

ఐ.వెంకటేశ్వర్లు, మండల విద్యా శాఖాధికారి, వేమూరు

నేడు వైఎస్సార్ జయంతి

రేపల్లె : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాన్ని మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ అనంతరం బస్టాండ్ సెంటర్లో ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించే కార్యక్రమం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

చెరుకుపల్లిలో మెగా రక్తదాన శిబిరం

దివంగత నేత వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని ఈఎస్ఆర్ హాస్పిటల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ దుండి వెంకటరామిరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ప్రతి గ్రామంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించాలి : నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

వేమూరు: దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ప్రతి గ్రామంలో నిర్వహించాలని నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తెలిపారు. ప్రతి గ్రామంలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని ఆయన కోరారు. సాయంత్రం 4 గంటలకు చుండూరు మండలంలోని వలివేరు గ్రామంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు అనపురెడ్డి రఘురామి రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.


పార్టీ కోసం పని చేయకుండా గొప్పలు చెప్పడం కాదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

భట్టిప్రోలు(వేమూరు): పార్టీ ఏ ఒక్కరిది కాదని అందరు పని చేస్తే విజయం సాధించడం జరుగుతుందని, కొందరు వ్యక్తులకు చెందినదిగా భావించుకోవడం సరైన పద్ధతి కాదని ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు అన్నారు. భట్టిప్రోలు మండల కేంద్రంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు తూనుగుంట్ల సాయిబాబా మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో భట్టిప్రోలు నుంచి 3 వేలు మెజారిటీ తీసుకొని రావడం జరిగిందని అంటూ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. దీంతో ఎమ్మెల్యే సాయిబాబాపై విరుచుకుపడుతూ తన కృషి వల్ల భట్టిప్రోలు ఇంత మెజార్టీ వచ్చిందని పదే పదే చెప్పటం సరైనది కాదని, పార్టీలో నాయకులు, కార్యకర్తలు అందరు సమష్టిగా పని చేయడం వల్ల ఎన్నికల్లో మెజార్టీ లభించిందని ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే హెచ్చరించారు. భట్టిప్రోలులో 5 వేలు మెజార్టీ రావాల్సి ఉండగా 3 వేలు ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించారు. మొత్తం తన వలనే జరిగిందని గొప్పలు చెప్పుకోవడం సరైన విధానం కాదన్నారు. వైఎస్సార్‌సీపీ పట్ల ఉన్న వ్యతిరేకత వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి అభ్యర్థికి మెజార్టీ లభించిందని అదే విధంగా తనకు కూడా వచ్చిందని, ప్రతి కార్యకర్త సమష్టి కృషితో పార్టీని అధికారంలోకి తీసుకురాగలిగమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సాయిబాబా ఇప్పటికై నా తీరు మార్చుకోవాలన్నారు. దీంతో ఎమ్మెల్యే మీద అలిగి సమావేశం నుంచి సాయిబాబా వెళ్లిపోయాడు. తూనుగుంట్ల సాయిబాబా తీరు సక్రమంగా లేకపోవడంతో పార్టీలో వర్గాలు ఏర్పడటం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో వేమూరు మార్కెట్‌యార్డు చైర్ పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, నీటి సంఘం అధ్యక్షులు వై.కరుణ, శ్రీనివాసరరావు, బీసీ నాయకులు బట్టు మల్లిఖార్జునరావు, మండల పార్టీ అధ్యక్షుడు వాకా శేషుబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోన ప్రభాకరరావు విగ్రహాన్ని బాపట్లలో ఏర్పాటు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బాపట్ల: కోన ప్రభాకరరావు విగ్రహాన్ని బాపట్లలో ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిలో సోమవారం వినతి పత్రం ఇచ్చారు. బాపట్ల నియోజకవర్గ అభివృద్ధికి అనుక్షణం కృషి చేసిన కోన ప్రభాకరరావు విగ్రహం ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరారు. రోడ్డు విస్తరణలో కోన ప్రభాకరరావు, గుర్రం జాషువా, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలను తొలగించారని, ఈ మేరకు మళ్లీ కూడలి ప్రాంతాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు 7–7–2023న ఆల్ పార్టీ మీటింగ్‌లో అప్పటి కమిషనర్ తీర్మానం చేశారని తెలిపారు. ఈ నెల 10వ తేదీన కోన ప్రభాకరరావు జయంతి ఉన్నందున విగ్రహం ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు వడ్డిముక్కల డేవిడ్, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య, నర్రావుల వెంకట్రావు, జోగి రాజా, పిన్నిబోయిన ప్రసాద్ తదితరులు ఉన్నారు.

మొక్కలు మానవ జీవితానికి ప్రాణాధారం

వల్లభాపురం (కొల్లిపర): మానవ జీవితానికి, ఇతర జీవులకు ప్రాణాధారంగా మొక్కలు ఎంతోగానో పోషిస్తున్నాయి అని అటువంటి మొక్కలను ప్రతి మనిషి సంవత్సరానికి ఒక్కసారైన ఒక మొక్క నాటి వాటి పూర్తి సంరక్షణ బాధ్యతలు తీసుకువాలని విఆర్‌వో అల్లా సుష్మా అన్నారు.మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలోని హైస్కూలు ఆవరణలో విజ్ఞాన్ యూనివర్సిటీ వ్యవసాయ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో వనమహోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కల నాటింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి ఆ గ్రామ వీఆర్‌వో సుష్మా పాల్గొన్ని హైస్కూలు విద్యార్థులకు మొక్కలు పెంచటం వలన కలుగు ప్రయోజనాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు పెంచటం వలన రానున్న భవిష్యత్ తరాలకు హరిత వారసత్వాన్ని అందించటం జరుగుతందని తద్వారా ప్రతి వ్యక్తి పూర్తి ఆరోగ్యవంతులుగా జీవిస్తారన్నారు. నేడు వన మహోత్సవాన్ని పురస్కరించుకుని విజ్ఞాన్ యూనివర్సిటీ, వ్యవసాయ విభాగానికి చెందిన విద్యార్థులు సామాజిక బాధ్యతను చాటుతూ మొక్కల నాటింపు కార్యక్రమం చేపట్టం ఎంతో విశేషమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, రైతులు, విద్యార్థులు తేజస్వి, పద్మిని, నవ్య, గాయత్రి, శ్రావంతి, తనుశ్రీ, వరలక్ష్మి, కావ్య, సోనాలీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాల్ హారీస్ పురస్కార ప్రదాన సభ



తెనాలిటౌన్: ప్రతి మనిషి ఉన్నంతలో తోటి మనిషికి సహాయ పడాలని బీజీఆర్ మైన్స్ డైరెక్టర్ వీసీ రెడ్డి బాలకోటిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో రోటరీ కళా పరిషత్ తెనాలి, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ద్వితీయ ఆహ్వాన పోటీలు ముగింపు సభలో రోటరీ వ్యవస్థాపకులు పాల్ హారీస్ పురస్కార ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన పాటిబండ్ల సాంబశివరావు (శ్యామ్)కు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా బిజీఆర్ మైన్స్ డైరెక్టర్ వీసీరెడ్డి బాలకోటి రెడ్డి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, పాల్గొని సాంబశివరావును సత్కరించి పురస్కారాన్ని ప్రదానం చేశారు. లెక్చరర్‌గా, వ్యాపారవేత్తగా రోటరీలో సమర్థంగా సేవలందిస్తూ అనేక అవార్డులు సాధించిన సాంబశివరావు సేవలు అభినందనీయమనివక్తలు కొనియాడారు. ఆయన సేవా స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రోటరీలో ఆయన చేస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో రోటరీ పాస్ట్ గవర్నర్ అందె రత్న ప్రభాకర్, రోటరీ క్లబ్ తెనాలి అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఈదర వెంకట పూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు, డాక్టర్ జీవనలత, పలువురు రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించండి



తెనాలిఅర్బన్: పట్టణంలో జరిగే రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనుల్లో న్యాణత ప్రమాణాలను అందరూ పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పట్టణంలోని 22వ వార్డులో సోమవారం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. కాల్వల్లోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. చెత్త సేకరణ నూరుశాతం జరిగే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో 22వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ షేక్ దుబాయ్ బాబు, ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్వా యేసు బాబు, టీపీవో సాంబశివరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇప్పించండి



తెనాలిఅర్బన్: సొంత ఇంటి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని, వాటిని ఇప్పించే విధంగా చూడాలని పట్టణవాసి కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కవిరాజా పార్కులో చెట్లు కొట్టివేయాలని, సర్వే నిర్వహించాలని, 20వ వార్డులో పొల్యూషన్ వలన ఇబ్బందులు పడుతున్నామని పలువురు అర్జీలు అందజేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏసీపీ శివన్నారాయణ, డీఈలు ఆకుల శ్రీనివాసరావు, శ్రీనివాసులు, శ్రీనివాసరావు, ఆరోగ్యాధికారి డాక్టర్ యేసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ’ పోస్టర్ల విడుదల



అమర్తలూరులో క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించిన వరికూటి అశోక్‌బాబు

అమర్తలూరు(వేమూరు): ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసం అనేక అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేయడం జరిగిందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. వేమూరు నియోజకవర్గంలోని అమర్తలూరు మండల కేంద్రంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీపై మండల స్థాయి కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేసిన మోసాలపై క్యూఆర్ కోడ్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నియోజకవర్గం స్థాయి నుంచి గ్రామ, వార్డు స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందని అన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు హామీలిచ్చి అధికారం వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పాలనలో హామీల అమలులో జరుగుతున్న మోసాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా ప్రజలకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో గొట్టిపాటి హేమచంద్ర శ్రీనివాసరావు, రావర్ల నరేంద్ర, పడమటి శ్రీనివాసరావు, పెద్ద బుజ్జి, నాగమల్లేశ్వరరావు, దాది సుబ్బారావు, అనపురెడ్డి రఘురామి రెడ్డి, హుస్సేన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం నగదు జమ కాలేదని.. ఆక్రమణలు తొలగించాలని



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి

రేపల్లె: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు అందినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి చెప్పారు. స్థానిక కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అనంతరం మాట్లాడారు. రేపల్లె మండలం సింగుపాలెం గ్రామంలో తమ పొలానికి వెళ్లే బండ్లబాట నుంచి వెళ్లనివ్వకుండా ఆ గ్రామ రైతులు అడ్డుకుంటున్నారని సమస్యను పరిష్కరించాలని రేపల్లె మండలం ఉప్పూడి పంచాయతీలోని కమ్మవారిపాలెం గ్రామస్తులు అర్జీ ఇచ్చారన్నారు. తమ పట్టాదారు పాసుపుస్తకంకు ఆధార్ సీడింగ్ చేయాలని వేమూరు మండలం పెరవలి గ్రామానికి చెందిన లింగినేని గీతాదేవి, తన ఇంటికి వెళ్లే రహదారి మార్గం సమస్యలను పరిష్కరించాలని చుండూరు మండలం మండూరు గ్రామానికి చెందిన బెల్లం వెంకటసుబ్బారావు, ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించిన ఇంతవరకు నగదు జమ కాలేదని నల్లూరు గ్రామానికి చెందిన తొట్టెంపూడి బుచ్చి రామకృష్ణ అర్జీలు ఇచ్చారన్నారు. రహదారి విస్తరణలో తన స్థలాన్ని కోల్పోయిన ఇప్పటి వరకు నష్ట పరిహారం అందలేదని.. అందేలా చూడాలని ఓల్డ్ టౌన్‌కు చెందిన సురేష్, నగరం మండలం వెనిగళ్లవారిపాలెంలో పంచాయతీ రోడ్డు ఆక్రమణకు గురైందని పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని అదే గ్రామానికి చెందిన చిలకా అనిల్ బాబు అర్జీలు ఇచ్చారన్నారు. కొల్లూరు మండలం జువ్వలపాలెం గ్రామంలోని తన ఇంటి స్థలంకు రహదారి మార్గం సమస్యను పరిష్కరించాలని భట్టిప్రోలు మండలం చింతమోటు గ్రామానికి చెందిన కాలం వేణు, తమ నివాస గృహాల పక్కనే జరుగుతున్న సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపేయాలని బేతపూడి గ్రామస్తులు అర్జీలు అందజేశారన్నారు. ఫిర్యాదులను పరిశీలించి ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కరించబడునన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే జీవితం అంధకారం

ఎస్‌ఐ బాబూరావు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ బాబూరావు

నిజాంపట్నం: ఈవ్‌టీజింగ్‌కు పాల్పడి తమ జీవితాలను అంధకారం చేసుకోరాదని అడవులదీవి ఎస్‌ఐ బాబూరావు సూచించారు. మండలంలోని అడవులదీవి జెడ్పీ హైస్కూలులో ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థులకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈవ్‌టీజింగ్ ద్వారా పొందే పైశాచికానందంతో మానసిక రోగులుగా మారేందుకు అవకాశం ఉంటుందన్నారు. మహిళలు, బాలికలు, చిన్నారుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, బాలికల సంరక్షణకై ప్రభుత్వం చేసిన చట్టాలపై అవగాహన ఉంటే తమని తాము రక్షించుకోవచ్చని సూచించారు. బాలికల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఉపాధ్యాయులకు గానీ, తల్లిదండ్రులకు గానీ తెలియజేయాలన్నారు. విద్యార్థులు చదువుపై మాత్రమే దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. ఈ సందర్భంగా బాలికలపై లైంగిక వేధింపులు, బాలికల భద్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొనాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్

రేపల్లె: కార్మికుల సమస్యల సాధనకై జూలై 9న దేశవ్యాప్తంగా తలపెట్టిన కార్మిక సంఘాల సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొనాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ కోరారు. మండల కేంద్రమైన నిజాంపట్నంలో సోమవారం వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులతో సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదభరితమైన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు నిర్వహించనున్న సమ్మెలో కార్మికులు ఐక్యంగా పాల్గొనాలన్నారు. రవాణా రంగంలో ఆటో కార్మికుల పాత్ర కీలకమని, ఆటో కార్మికుల సంక్షేమం కోసం కార్మిక సంఘాలు నిరంతరం పోరాడుతున్నాయన్నారు. పది సంవత్సరాల డీజిల్, 15 సంవత్సరాల పెట్రోలు వాహనాలను స్క్రాప్ చేయాలని కేంద్రం తీసుకువస్తున్న నిబంధన వాహనాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న డ్రైవర్‌లకు భారంగా మారుతుందన్నారు. ఇవే కాకుండా కేంద్రం తీసుకువస్తున్న లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే దేశ వ్యాప్తంగా కార్మికులు తీవ్రంగా నష్టపోవటంతో పాటు హక్కులు కోల్పోతారన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను కాపాడుకుని లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మికులు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు కొప్పుల గోపి, చెన్ను ప్రహల్లాదుడు, పి.సురేష్, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల సమ్మెను విజయవంతం చేయాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కృష్ణమోహన్

చుండూరు(వేమూరు): కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలపై ఉమ్మడి పోరాటాలు చేద్దామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణ మోహన్ పిలుపునిచ్చారు. చుండూరు మండల కేంద్రంలోని ఆటో కార్మికులకు కరపత్రాలు సోమవారం ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 9న జరిగే సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ధరల పెరుగుదలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, అబ్దుల్లా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.